క్లుప్తంగా

పండ్ల తోటల సాగుకు దరఖాస్తు చేసుకోవాలి

వల్లూరు : నీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం కలిగి పండ్ల తోటలు సాగు చేయాలని ఆసక్తి వున్న చిన్న, సన్న కారు రైతులకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పండ్ల తోటలను సాగు చేసుకోవడానికి అవకాశం వుందని ఎంపీడీఓ జుబేద ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద రైతులకు ఉచితంగా మొక్కలు నాటడానికి గుంతలు తీయడం, మొక్కలు నాటడం, ఎరువులకు, మొదటి సంవత్సరం నీటి తడులు అందించడం వంటి పనులకు నిధులను అందిస్తారన్నారు. రైతు సాగు చేసే పండ్ల రకాన్ని బట్టి ప్రభుత్వం నిర్దేశించిన రేట్ల ప్రకారం ఎప్పటికప్పుడు రైతుల బ్యాంకు ఖాతాలకు నిధులను జమ చేస్తారన్నారు. పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి వున్న మండల పరిధిలోని రైతులు ఆయా గ్రామ పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా గానీ, వల్లూరులోని మండల ఉపాధి హామీ కార్యాలయం ద్వారా గానీ దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ తెలిపారు.

నేడు బహిరంగ వేలంపాట

వేంపల్లె : వేంపల్లెలో పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీలక్ష్మీవృషభాచలేశ్వరస్వామి దేవస్థాన కల్యాణ మండపంలో శనివారం ఉదయం 10 గంటలకు శ్రీవృషభాచలేశ్వర దేవస్థాన కల్యాణ మండపం లీజుకు ఇచ్చేందుకు, 11 గంటలకు తలనీలాలు ప్రోగు చేసుకునే హక్కు పొందేందుకు దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం పాట నిర్వహిస్తారని ఆలయ ఈఓ శ్రీధర్, ఆలయ పాలక మండలి చైర్మన్ వెంకటేష్‌లు తెలిపారు. ఈ వేలం పాటలో హిందువులు మాత్రమే పాల్గొనాలన్నారు. మరిన్ని వివరాలకు దేవస్థాన కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

29న పట్టుబడిన వాహనాలకు వేలం

పులివెందుల రూరల్ : పులివెందుల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలకు ఈనెల 29వ తేదీన బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఎస్ఈబీ సీఐ రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వేలం పాటలో పాల్గొనే వారు ఆధార్ కార్డు, ధరావతు పైకం అదేరోజు పోలీస్‌స్టేషన్‌లో చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు ఎస్ఈబీ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

29 నుంచి వేరుశనగ విత్తనాలు పంపిణీ

ముద్దనూరు : ఈనెల 29వ తేదీ నుంచి వేరుశనగ సాగుచేసే రైతులకు 40 శాతం రాయితీతో విత్తనకాయలు పంపిణీ చేయనున్నట్లు శుక్రవారం మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. విత్తనకాయలు అవసరమైన రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని మండలానికి 140 క్వింటాళ్ళ విత్తనకాయలు మంజూరైనట్లు ఏఓ తెలిపారు.

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న మెప్మా సిబ్బంది

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని మెప్మా సంస్థ ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రపంచ రుతుస్రావ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీఓ వసంతరెడ్డి, సచివాలయ హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధులకు ఊత కర్రలు పంపిణీ


వృద్ధులకు ఊత కర్రలను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల ఐసీఎల్ ఆధ్వర్యంలో కాలనీలోని ఉమామహేశ్వరిస్వామి దేవాలయంలో పేద వృద్ధులైన 108 మందికి ఊత కర్రలను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీఎల్ ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావు, హెచ్ఆర్ హెడ్ నాగిరెడ్డి, బి. సుధాకర్‌రెడ్డి, శవరనన్‌లు ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు అనుమతి మంజూరు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామానికి ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేసిందని ఈ ఏడాది నుంచి క్లాసులు ప్రారంభం కానున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్ తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం బాలికల జూనియర్ కళాశాల ప్రారంభించడానికి ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిందన్నారు. ఎంపీసీ, సీఈసీ గ్రూపులు మంజూరయ్యాయని, కళాశాలకు అధ్యాపక సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించారన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోనే క్లాసులు జరుగుతున్నాయని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మట్టిలో మాణిక్యాలు.. జగనన్న ఆణిముత్యాలు

పులివెందుల రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జగనన్న ఆణిముత్యాలు అనే సరికొత్త పథకం ప్రవేశపెట్టింది. టెన్త్, ఇంటర్‌లలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలను ప్రభుత్వం అందజేయనుంది. విద్యారంగంలో వినూత్న మార్పులు తీసుకొచ్చి విద్యార్థులలో మరింత ప్రోత్సాహాన్ని నింపేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని అధికార పార్టీ నాయకులు చెబుతున్నారు. విద్యార్థులలో ఏ మాత్రం అసమానత లేకుండా ప్రతిభ ఆధారంగా నగదు ప్రోత్సాహకాలను అందిస్తుండటంపట్ల విద్యార్థి లోకం హర్షిస్తోంది. ఈ పథకం ప్రకారం టెన్త్‌లో నియోజకవర్గ స్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలలో విద్యార్థులను ఎంపిక చేసి వారికి నగదు పురస్కారాలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం భావిస్తోంది. పదవ తరగతిలో నియోజకవర్గస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థికి ప్రథమ బహుమతి రూ.15వేలు, రెండవ బహుమతి రూ.10వేలు, మూడవ బహుమతి రూ.5వేలు, అలాగే జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి రూ.25వేలు, రెండవ బహుమతి రూ.15వేలు, మూడవ బహుమతి రూ.10వేలు, రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి రూ.50వేలు, రెండవ బహుమతి రూ.35వేలు, మూడవ బహుమతి రూ.25వేల


ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు (ఫైల్‌ఫొటో)

చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందజేస్తారు. అలాగే ఇంటర్‌లో కూడా నియోజకవర్గస్థాయిలో రూ.25వేలు, జిల్లాస్థాయిలో రూ.50వేలు రాష్ట్రస్థాయి ప్రతిభా విద్యార్థులకు లక్ష రూపాయల చొప్పున నగదు పురస్కారం అందజేయనున్నారు. ఈ వాస్తవానికి ఈ పథకం నియోజకవర్గస్థాయిలో ఈనెల 25వ తేదీన, జిల్లాస్థాయిలో ఈనెల 27వ తేదీన, రాష్ట్రస్థాయిలో ఈనెల 31వ తేదీన అమలు చేయాల్సి ఉంది. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ పథక కార్యక్రమాలు వాయిదా వేసినట్లు తెలుస్తోంది. పాఠశాలలు పునఃప్రారంభమైన తర్వాత ఈ పథకం అమలు చేయనున్నారు.

జగనన్న ఆణిముత్యాలు మంచి పథకం



ఇలాంటి పథకాలు విద్యార్థులలో నూతనోత్సాహం నింపుతుంది. విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి వంటి పథకాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఆదరణ లభిస్తోంది. పథకాలు అమలు చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యం.
– వరప్రసాద్ (మున్సిపల్ చైర్మన్), పులివెందుల

పోటీతత్వం పెరుగుతుంది..



ఈ పథకం వల్ల విద్యార్థులలో పోటీతత్వం పెరుగుతుంది. ప్రతి ఏడాది విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు ఈ పథకం ఎంతో ప్రోత్సాహం అందిస్తుంది. తల్లిదండ్రులకు కూడా ఉపశమనం కలిగిస్తుంది.
– సర్వోత్తమరెడ్డి(మార్కెట్ యార్డు వైస్ చైర్మన్), పులివెందుల

వైభవం.. శివపార్వతుల కల్యాణం

కమలాపురం : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో మండలంలోని పందిళ్లపల్లె గ్రామ సమీపంలో వెలసిన శ్రీ క్షేత్రపాలక కాలభైరవేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ 13వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం ఆలయ ధర్మకర్త, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పెళ్లి పీటలపై ఆశీనులు చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం

వల్లూరు : మండల పరిధిలోని పైడికాలువ సమీపంలో శుక్రవారం పెండ్లిమర్రి మండలం మాచనూరుకు చెందిన బ్రహ్మయ్యను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 25 అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి జ్యుడీషియల్ కస్టడీకి పంపినట్లు ఎస్ఐ పెద్దఓబన్న తెలిపారు.

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

వేముల : గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ లింగాల ఉషారాణి తెలిపారు. వేములలోని స్థానిక గ్రంథాలయ శాఖలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాలను శుక్రవారం ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం చేసినప్పుడే మంచి అలవాట్లు, నడవడిక, వినయ విధేయతలు అలవడుతాయన్నారు. చిన్నపిల్లలు ఈ వయస్సు నుంచే పుస్తకాలను చదవడంవల్ల గొప్ప ప్రయోజకులవుతారన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి తమ వంతు సహకారం ఉంటుందన్నారు. వేములలో రూ.41 లక్షల పాడా నిధులతో నిర్మిస్తున్న గ్రంథాలయ భవన నిర్మాణాలను అధికారులతో మాట్లాడి పూర్తి చేసేందుకు సహకరిస్తామన్నారు. సమ్మర్ క్యాంపులో పిల్లలకు మంచి కథలు వినిపిస్తారని.. మానసిక ఉల్లాసం కోసం డ్యాన్స్, ఆటల పోటీలు, డ్రాయింగ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాలలు తెరిచే వరకు గ్రంథాలయ శాఖ నిర్వహిస్తున్న సమ్మర్ క్యాం


మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ లింగాల ఉషారాణి

పును సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థుల చిత్రలేఖన బొమ్మలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జర్మియ, గ్రంథాలయ అధికారి గంగాధర యాదవ్, పాఠకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతోనే ఏకాగ్రత

కమలాపురం : ధ్యానం చేయడంతోనే ఏకాగ్రత పెరుగుతుందని కమలాపురం శాఖా గ్రంథాలయాధికారిణి నాగాంజలి తెలిపారు. ఈనెల 8వ తేదీ నుంచి స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో భాగంగా శుక్రవారం విద్యార్థులతో ఆమె ధ్యానం చేయించారు.

పొలతల దేవస్థానం అభివృద్ధికి కృషి

- రూ.3.64 కోట్లతో వివిధ పనులకు భూమిపూజ
- ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : పొలతల మల్లేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. పొలతల దేవస్థానంలో శుక్రవారం తిరుమల తిరుపతి దేవస్థానం–శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక నిధులతో రూ.3.64 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలతల క్షేత్రంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని చర్యలు చేపడతామన్నారు. ఇప్పటికే క్షేత్రంలో నూతనంగా అక్కదేవతలు, పులిబండెన్న, పుట్ట అంజనేయస్వామి ఆలయ నిర్మాణాలు పూర్తైయ్యాయన్నారు. ప్రస్తుతం మల్లేశ్వరస్వామి ఆలయ ముఖద్వారం వద్ద రాజగోపుర నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. టీటీడీ వారి ఆర్థిక నిధులతో అన్నదాన బిల్డింగ్, గెస్ట్‌హౌస్, పది వసతి గదులు, డార్మెంటరి హాల్, టాయ్‌లెట్స్ బ్లాక్ వంటి నిర్మాణ పనులకు భూమి పూజ చేశామన్నారు. పొలతల దేస్థానంకు ఆర్థిక నిధులు అందించిన టీటీడీ చైర్మన్ వై.వీ.సుబ్బారెడ్డి, టీటీడీ ఈఓ ధర్మారెడ్డిలకు ప్రత్యేక


పొలతలలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి


ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఈఓ మహేశ్వర్‌రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు నాగమల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, సుబ్బిరెడ్డి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

చింతకొమ్మదిన్నె : రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం 17వ డివిజన్‌లోని చిన్నముసల్‌రెడ్డిపల్లె, అంగడివీధి గ్రామాల్లో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి మట్లాడారు. కులం, మతం , పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, 17వ డివిజన్ కార్పొరేటర్ గుత్తిరెడ్డి చంద్రహాసరెడ్డి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు వెంకటరెడ్డి, నాగరాజు, సర్పంచులు సురేంద్రారెడ్డి, మల్లిఖార్జున యాదవ్, సింగిల్ విండో అధ్యక్షుడు రాజారెడ్డి, గజ్జల శ్రీరామిరెడ్డి, 17వ డివిజన్ ఇన్‌చార్జ్ గుత్తిరెడ్డి లక్ష్మిరెడ్డి, మట్టి శ్రీనివాసులురెడ్డి, నాయకులు చిన్నసిద్దయ్య, జగన్‌మోహన్‌రెడ్డి, శివ, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి) లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ దినేష్‌కుమార్‌రెడ్డి కిడ్నీలో రాళ్లు, కిడ్నీ వాపు, కిడ్నీ గడ్డలు, కిడ్నీ అండ్ యూరిన్ ఇన్ఫెక్షన్, మూత్ర సమస్యలు, పోస్టేట్ గ్రంథి సమస్యలు తదితర జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ వైద్యులు డాక్టర్ డి.వి.నారాయణరెడ్డి ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో ఉండి ఎండోస్కోపీ, కోలోనోస్కోపీ, అన్ని జీర్ణకోశ, లివర్, ఫ్యాంక్రియాస్ క్యాన్సర్‌లకు ఆపరేషన్లు చేస్తారన్నారు. అలాగే ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. షుగర్ పరీక్షలు చేయించుకోవాలనుకునేవారు పడగడపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

సురక్షితమైన నీటిని సరఫరా చేయండి


నీటి ఫిల్టర్ హౌస్‌ను పరిశీలిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో సురక్షితమైన నీటిని సరఫరా చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డితో కలిసి పట్టణానికి నీటిని సరఫరా చేసే ఫిల్టర్ హౌస్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి ఫిల్టర్లకు సంబంధించి నీటి మోటార్ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సరైన నిష్పత్తిలో నీటి ట్యాంకులలో క్లోరిన్ కలిపి పట్టణంలోని మున్సిపాలిటీ గ్రామాలకు తాగు నీటిని సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీరింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చెన్నూరుకు ఎమ్మెల్యే రాక

చెన్నూరు : స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం ఉదయం 9.30కి వలంటీర్లకు నిర్వహించే సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి రానున్నట్లు ఎంపీడీఓ గంగనపల్లె సురేష్, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్‌లు తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామ సచివాలయ వలంటీర్లతోపాటు, వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు, హాజరుకావాలన్నారు. అలాగే స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 11 గంటలకు ఆస్పత్రి అభివృద్ధిపై జరిగే సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొంటారని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులందరూ హాజరు కావాలని సామాజిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సతీష్‌కుమార్ తెలిపారు.

కల్తీ మాంసం విక్రయిస్తే చర్యలు

వేంపల్లె : స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలో ఎవరైనా కల్తీ మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని గ్రామ పంచాయతీ ఈఓ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో చాలాచోట్ల గొర్రెలు, మేకలు చనిపోయిన తర్వాత వాటిని వధించి మాంసం విక్రయదారులు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు అందాయన్నారు. దీంతో పంచాయతీ ఈఓ ఆదివారం నుంచి ఎవరైనా సరే కల్తీ మాంసం విక్రయిస్తే వారిపైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక ధరలకు మాంసం విక్రయిస్తే వారిపైన జరిమానా విధిస్తామన్నారు. అందుకు సంబంధించి శనివారం మాంసం విక్రయదారులకు సమావేశం ఉంటుందన్నారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి

కడప సెవెన్‌రోడ్స్ : దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు భారతరత్న అవార్డును ప్రకటించాలని దూదేకుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు మన్నూరు అక్బర్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

అందరూ కలిసికట్టుగా పనిచేయాలి

– వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు

జమ్మలమడుగు : వచ్చే ఎన్నికలను అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకుని తిరిగి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేందుకు తమవంతు బాధ్యతగా ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డికి సహకరించి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం పెద్దముడియం మండలంలోని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డికి చెందిన నాయకులు, కార్యకర్తలతో, అలాగే ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్సీ ఇంటి వద్ద కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సు రేష్‌బాబు మాట్లాడుతూ రామసుబ్బారెడ్డి వైఎస్సార్‌సీపీలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానాన్ని కల్పించారన్నారు. ఆదేవిధంగా కార్యకర్తలు, నాయకులు వర్గాలను మరచి వైఎస్సార్‌సీపీ కోసం కలిసికట్టుగా పనిచేసి భారీ మెజార్టీతో వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పెద్దముడి యం మండలంలో నాయకులందరూ కలిసికట్టుగా పనిచేస్తే వైఎస్సార్‌సీపీకి భారీ మెజార్టీ రావడం ఖాయం అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి వర్గాన్ని సురేష్‌బాబు, ఎమ్మెల్యే మూలె సుధీర్‌రెడ్డిలు కలిసి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చవ్వా రామకృష్ణారెడ్డి, సి. ఈశ్వరరెడ్డి, వి. విశ్వనాథ్‌రెడ్డి, ఉలవపల్లె సుధీర్‌రెడ్డి, గ్యాస్ శివారెడ్డి, పెద్ద వీరారెడ్డి, పాప వీరారెడ్డి, చిన్న మొడియం కృష్ణారెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి వర్గాన్ని పార్టీలోకి ఆహ్వానిస్తున్న సురేష్‌బాబు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిలు

ఈఎస్ఐ పథకాన్ని బలోపేతం చేయాలి

కమలాపురం : కేంద్ర ప్రభుత్వం ఈఎస్ఐ పథకాన్ని బలోపేతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనువాసులురెడ్డి తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక బీడీ కార్మిక ఆసుపత్రి ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమలాపురం బీడీ ఆసుపత్రి నందు ముగ్గురు సిబ్బంది ఉండాల్సి ఉండగా మెడికల్ ఆఫీసర్, ఎంటీఎస్, స్టాఫ్‌నర్స్ ముగ్గురు సెలవుపై వెళ్లడంతో ఆసుపత్రి పార్ట్‌టైం స్వీపర్ మాత్రమే నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ మంతటా ఈఎస్ఐ పథకాన్ని 2022 కల్లా విస్తరించాలని నిర్ణయం తీసుకున్నప్పటికి అది ఎక్కడా కనబడని పరిస్థితి నెలకొందన్నారు. జిల్లాలో కనీసం 7 నియోజకవర్గాల్లో 30 పడకల ఆసుపత్రులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.లక్ష్మీదేవి, ఆటో యూనియన్ జిల్లా నాయకుడు రాజేష్, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బీడీ కార్మికుల ఆసుపత్రి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

పనులను వేగవంతం చేయండి

పులివెందుల రూరల్ : నైపుణ్యాభివృద్ధి సంస్థ పనులను వేగవంతం చేయాలని స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని నగరిగుట్ట సమీపంలో నిర్మిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ భవన నిర్మాణ పనులను పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాలకు సంబంధించి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాలకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టి జులై నెలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించే విధంగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.


స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎండీ వినోద్‌కుమార్

పథకాల అమలులో వలంటీర్లదే కీలక బాధ్యత

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలులో వలంటీర్లదే కీలక బాధ్యత అని సర్పంచ్ జి.రామనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని పి.బొమ్మెపల్లి సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి మహేంద్రారెడ్డి అధ్యక్షతన అంబవరం, గండికోట, బొమ్మెపల్లి పరిధిలో ఉన్న వలంటీర్లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. వలంటీర్ల వ్యవస్థ ఉండటంతోనే నేడు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుడి ఇంటికి చేరుతున్నాయన్నారు. అనంతరం సేవా రత్న అవార్డుకు ఎంపికైన నాయబ్‌రసూల్‌కు ప్రభుత్వం రూ.20 వేలు, సేవామిత్రకు ఎంపికైన అచారికి రూ.10 వేలు నగదును అందించారు. అనంతరం 26 మంది వలంటీర్లకు సన్మానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొత్తకుంట పల్లె శ్రీను తదితరులు పాల్గొన్నారు.


వలంటీర్లను సన్మానించిన సర్పంచ్

ఏ సమాచారమైనా పోలీస్‌స్టేషన్‌లో తెలపాలి

– డీఎస్పీ వినోద్‌కుమార్

సింహాద్రిపురం : మండలంలోని గ్రామాల్లో ఏ సమాచారమైనా పోలీస్‌స్టేషన్‌లో తెలపాలని పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ మహిళా పోలీసులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి ఎస్ఐ రోషన్‌ను పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఫ్యాక్షన్ గ్రామాల్లో నిఘా ఉంచాలని.. అలాగే అసాంఘిక కార్యకలాపాలపై ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా ఉక్కుపాదం మోపి అణిచి వేయాలన్నారు. పులివెందుల డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారిగా పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. అనంతరం మండల సచివాలయ మహిళా పోలీసులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో సమస్యలను, సమాచారంపైన నిర్లక్ష్యం వహిస్తే పెద్దవి కావచ్చునని నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటి సమాచారాన్ని అప్పుడే అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


మహిళా పోలీసులతో మాట్లాడుతున్న డీఎస్పీ వినోద్‌కుమార్

కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రోషన్ హెచ్చరించారు. అంకాలమ్మగూడూరులో శుక్రవారం ఎస్ఐ రోషన్ పోలీసులతో కలిసి పర్యటించి మాట్లాడారు. గ్రామంలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పడానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే కఠిన చర్యలు తప్పవమన్నారు.

వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

జమ్మలమడుగు : తూగుట్లపల్లి జాగిర్‌ధార్ హజరత్ సయ్యద్ షా బడెగౌస్ పీరాఖాద్రీ 91వ ఉరుసు మహోత్సవం సందర్భంగా ఆదివారం గౌసియా షాదీఖానాలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆస్థానయే గౌసియా పీఠాధిపతి, ప్రభుత్వ గెజిటెడ్ ఖాజీ సయ్యద్‌షా గౌస్ పీరాఖాద్రీ శుక్రవారం స్థానిక ఆస్తానయే గౌసియాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆదివారం ఉదయం సూపర్ స్పెషాలిటీ వైద్యులచే వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులను పంపిణీ చేస్తారన్నారు. ఆదేవిధంగా 31వ తేదీ ఒంగోలు జాతి ఎద్దుల పోటీలను నిర్వహిస్తారని, అలాగే జూన్ 1వ తేదీన సర్వమత సమ్మేలన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

వల్లూరు : విద్యార్థుల మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరమని చిన్నతనం నుంచే చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని వల్లూరు శాఖ గ్రంథాలయ అధికారిణి వెంకటేశ్వరమ్మ తెలిపారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న సమ్మర్ క్యాంపులో భాగంగా శుక్రవారం విద్యార్థులకు చెస్, లూడో, క్యారమ్స్ ఆటలపై అవగాహన కల్పించారు. అనంతరం వారి చేత ఆటలను ఆడించారు. పుస్తక పఠనం చేయించి, దాని వలన కలిగే లాభాలను వివరించారు.

ఎమ్మెల్యే పరామర్శ

కమలాపురం : మండల జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డిని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి పరామర్శించారు. జడ్పీటీసీ సోదరుడు లింగాల గంగిరెడ్డి (57) గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, ఆయన తనయుడు సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి శుక్రవారం జడ్పీటీసీ నివాసానికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.